క్లుప్తంగా

రైల్వే పోలీస్ డైరీ ఆవిష్కరణ



రైల్వే పోలీసు డైరీని ఆవిష్కరిస్తున్న డీజీపీ కేవీ మోహన్‌రావు, జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు: రైల్వే పోలీస్ డైరీ–2025ను డీజీపీ కేవీ మోహన్‌రావు, గుంతకల్లు డివిజన్ జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా ఆవిష్కరించినట్లు గుంతకల్లు రైల్వే పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం విజయవాడలోని డీజీపీ చాంబర్‌లో డైరీని ఆవిష్కరించారన్నారు. డైరీలో రైల్వే పోలీసులకు సంబంధించిన విధి, విధానాలను పొందిపరిచారన్నారు. కార్యక్రమంలో రైల్వే పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, సీఐడీ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కిరాజు, రాష్ట్ర కో ఆప్షన్ మెంబర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఫ్రీడం ఫైటర్ సూర్యానారాయణ రెడ్డి

గుత్తి: గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఫ్రీడం ఫైటర్ సూర్యానారాయణ రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌లు డిమాండ్ చేశారు. గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌లో సోమవారం గుత్తి కోట నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సామాజిక కార్యకర్తలు నరేష్ రాయల్, సుధాకర్, నాగార్జున, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

జకినీమాత జాతర జయప్రదం చేయండి

గుత్తి: ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ రావు, ధర్మకర్త సురేష్‌రావు కోరారు. ఆలూరులో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా సోమవారం సునామ జకినీ మాత పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 6, 7 తేదీల్లో సునామ జకినీ మాత జాతరకు దేశం నలుమూలల నుంచి భారీగా ఆరె కటికలు వస్తారన్నారు. జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె.సాయినాథ్, గౌరవాధ్యక్షుడు సాయిబాబా, ఉపాధ్యక్షులు రుక్మాజీ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణే లక్ష్యంగా వైద్యశిబిరాలు



పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: పశు సంరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం గార్లదిన్నె, ముకుందాపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 98 దూడలకు నట్టల నివారణ మందులు, 152 పెద్ద పశువులకు బద్దెపురుగు, ఏలిక పాముల నివారణ మందులు పంపిణీ, 149 గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అనంతరం శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జేసీ.అస్మిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పట్టణంలోని బందామసీదు, చిన్నబజారు, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కౌన్సిలర్లు అబ్దుల్‌రెహమాన్, విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ నియాజ్‌బాషా, టీడీపీ నాయకుడు ఖాదర్‌బాషా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి రైతుకు ధరాఘాతం



- పండించిన పంటకు ధర లేక ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ మార్గాలు లేక అన్నదాతకు అవస్థలు



గోవిందపల్లిలో యంత్రంతో వరి కోస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: వేలాది రుపాయలు వెచ్చించి సాగు చేసిన వరి పంటకు సరైన ధర లేక పోవడంతో రైతన్నలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంటకు సరైన గిట్టుబాటు ధర లేదు. దీంతో పండించిన వరిధాన్యం అంతా కల్లాలోనే నిల్వలున్నాయి. బుక్కరాయసముద్రం మండలంలో బోరుబావులు, చెరువుల కింద రైతులు విస్తారంగా వరి పంట సాగు చేశారు. కొట్టాలపల్లి, భద్రంపల్లి, గోవిందపల్లి, బోయకొట్టాల, పొడరాళ్ల, వడియంపేట, జంతలూరు, నీలాంపల్లి, రెడ్డిపల్లి, వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి, సంజీవపురం, కేకే అగ్రహారం, చెదల్ల, నీలారెడ్డిపల్లి గ్రామాల్లో 2,700 హెక్టార్ల వరి పంట సాగైనట్లు అధికారుల అంచనా.

ధరల్లేక ఇబ్బందులు

ఎకరా వరి పంట సాగుకు రైతులు దాదాపు రూ.20 వేల రుపాయలు పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికి వచ్చిన తరువాత మార్కెట్‌లో సరైన ధర లేక పోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో బీపీటీ రకం 100 కిలోల బియ్యం ధర రూ.3,500 నుంచి రూ.4,000 ధర పలుకుతోంది. అయితే వరిని పండించిన రైతులకు మాత్రం సరైన ధరను ప్రభుత్వం కల్పించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం ధర రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ధర పలికింది. అప్పట్లో వరి పండించిన రైతులకు సరైన ధర లభించిందని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో బీపీటీ వరి రకం రూ.1,600తో వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. 1010 వరి రకం రూ.1450 నుంచి రూ.1550తో కొంటున్నారు.

నియోజకవర్గంలో వరిసాగు ఇలా..

మండలం	హెక్టార్లలో
బుక్కరాయసముద్రం	2,700
గార్లదిన్నె	1,500
నార్పల	2,200
పుట్లూరు	1,250
యల్లనూరు	1,302
శింగనమల	1,400

కల్లాల్లోనే పంట నిల్వలు

ధర సరిగా లేక పోవడంతో రైతులు కల్లాలోనే వరి నిల్వలు ఉంచుకుంటున్నారు. చేతికి వచ్చిన పంటను అమ్ముకునే సమయంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అధికార యంత్రాంగం కూడా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తామని చెప్పుతున్న పాలకుల మాటలు నీటి మాటలుగా మిగిలాయి. గ్రామాల్లో ఎక్కడా వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలు కనిపించలేదు.

వ్యాపారుల సిండికేట్

వ్యాపారులంతా సిండికేట్ అయి తక్కువ ధరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పంట విక్రయించే సమయంలో ఎవరూ భరోసా ఇవ్వక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం సరైన ధర, మార్కెట్ సౌకర్యం లేక పోవడంతోనే వరిసాగు చేసే రైతులు ఏటా పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



కొట్టాలపల్లిలో వరిధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఆదుకోవాలి

2.50 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరాకు 15 వేలు చొప్పున 35 వేలు పెట్టుబడి పెట్టా. 55 బస్తాలు వరి దిగుబడి వచ్చింది. వారం రోజుల నుంచి కల్లంలోనే ధాన్యం ఉంది. మార్కెట్‌లో ధర సక్రమంగా లేదు. ఎక్కడి వెళ్లి అమ్ముకోవాలో అర్థం కాలేదు. వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, రైతు, గోవిందపల్లి



మార్కెట్ సౌకర్యం కల్పించాలి

వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలి. వరి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకోవాలి. వేరుశనగ తర్వాత వరి సాగు చేసే రైతులే ఎక్కువ ఉన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి ప్రభుత్వమే వరి పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి.

– నల్లప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి



ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టండి



బుక్కరాయసముద్రంలో సర్వే చేస్తున్న సిబ్బంది



యాడికిలో సర్వేను పర్యవేక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్లు

బుక్కరాయసముద్రం/యాడికి: కుష్టు వ్యాధి నిర్మూలన భాగంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టండని మండల డాక్టర్ స్వాతి లక్ష్మి సూచించారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేపట్టే సమయంలో కుటుంబ సభ్యులందరికీ వైద్య సిబ్బంది లెప్రసీపై అవగాహన కల్పించాలన్నారు. శరీరంపై రంగు గల మచ్చలు, స్పర్శలేని మచ్చలు, రాగి రంగుల మచ్చలు, పాలి పోయిన మచ్చలు, దురద లేని మచ్చలు ఉన్నట్లయితే వైద్య శాఖ కార్యాలయంలో తెలపాలన్నారు. వాటికి మందులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, సత్య నారాయణ శాస్త్రి, ధనుంజయ, శివానంద, నాగరాజు, జ్యోతి, యామిని తదితరులు పాల్గొన్నారు.

- యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేపట్టారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్ర, సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్ కుష్టు వ్యాధిపై ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 2 వరకూ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పరమేశ్వర్, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే నిష్పక్షపాతంగా చేయండి



చిన్న మట్లగొందిలో రీ సర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వే నిష్పక్షపాతంగా చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. సోమవారం మండలంలోని మట్లగొందిలో భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభించారు.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ రీ సర్వే చేసే గ్రామాల్లో ముందుగా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే చేసే సమయంలో రైతులు అందుబాటులో ఉండి భూమి కొలతలు నిర్ధారించుకోవాలన్నారు. అనంతరం సర్వే సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీప్యూటీ తహసీల్దార్ పునీత్‌కుమార్, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, గ్రామ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఎంపిక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే, సభ్యులుగా ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓ గోపాల్, చిలకల రాజగోపాల్, లక్ష్మిదేవి, శ్యామల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఎంపికకు సంబంధించి స్థానిక టీడీపీ నాయకులు గుత్తి బీసీసీ రోడ్డుపై ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో మండల సమన్వయకర్త ఆర్.ఆర్. రమేష్ ఫోటో లేకపోవడంపై సొంతపార్టీలో గుసగుసలు వినిపించాయి.

మండీ ఏర్పాటు పరిశీలన

పామిడి పోలీస్‌స్టేషన్ ప్రహరీ ఆనుకొని ఉన్న స్టేషన్ స్థలంలో కూరగాయల తోపుడు బండ్ల మండీ ఏర్పాటుకు స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ విషయమై ఆయన ఎస్పీ జగదీష్‌ను ఫోన్‌లో సంప్రదించారు. తాత్కాలికంగా పోలీస్ స్టేషన్ స్థలంలో తోపుడు బండ్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.



అంకాలమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల గ్రామోత్సవ దృశ్యం

ఘనంగా అమ్మవార్ల గ్రామోత్సవం

పామిడి: పట్టణంలో సోమవారం రాత్రి అంకాలమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొండూరురోడ్డులో గ్రామస్తుల ఆధ్వర్యంలో వరుసగా మూడు రోజుల పాటు నిర్వహించే అమ్మవార్ల 17వ జాతరలో భాగంగా ఈ గ్రామోత్సవం చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంపై ఉంచి ఆలయ పూజారి నాగన్న ఆధ్వర్యంలో ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్లకు నిర్వహించిన ఈ ఊరేగింపులో భక్తాదులు దారిపొడవునా బారులు తీరి పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.



ఆకట్టుకున్న ఉరుము కళాకారుల నృత్యాలు

నేడు మండల సమావేశం

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సోమవారం తెలిపారు. మండలస్థాయి అధికారులు హాజరై తమ శాఖల ప్రగతి ప్రాముఖ్యతలపై చర్చించాలన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబరు తదితరులు హాజరు కావాలన్నారు.

29న గార్లదిన్నెలో..

గార్లదిన్నె: స్థానిక రైతు సేవా కేంద్రంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలన్నారు.

ఓవర్ హీట్‌తోనే ద్విచక్ర వాహనం దగ్ధం



కాలిపోయిన ద్విచక్ర వాహనం వద్ద యజమాని నాగేంద్రప్రసాద్

యాడికి: మండలంలోని రాయలచెరువు చెరువుకు పోయే ఘాటు రోడ్డులో వాహనంలో వచ్చిన మంటలతోనే ద్విచక్ర వాహనం దగ్ధమైనట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఈ నెల 18న మండలంలోని రాయలచెరువు సమీపంలో ఓ బైక్ కాలిపోయిన విషయం విదితమే. ఈ విషయంపై మండలంలో పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే నంబర్ ప్లేట్ ఆధారంగా సీఐ సోమవారం పెద్దవడుగూరు మండలం భీమునిపల్లికి చెందిన నాగేంద్రప్రసాద్‌రెడ్డిని బైక్ ఓనర్‌గా గుర్తించారు. బైక్ వద్దకు నాగేంద్రప్రసాద్‌రెడ్డిని రప్పించి వివరాలు సేకరించారు. ఘాట్ రోడ్డులో మోటార్ సైకిల్‌కు మధ్యాహ్నం 1గంట సమయంలో హీట్ అవగానే నిలిపి ఇంటికి వచ్చేందుకు ప్రయత్నించాడు. వెంటనే వాహనం నుంచి మంటలు రావటంతో కళ్ల ముందరే బైక్ కాలిపోయిందని వాహన యజమాని తెలిపాడని సీఐ తెలిపారు.

పెద్దమ్మ అమ్మవారికి నేడు బోనాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించనున్నారు. సోమవారం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెద్దమ్మ అమ్మవారికి భక్తి,శ్రద్ధలతో బోనాలు సమర్పించడం ఆనవాయితీ అన్నారు. గ్రామస్తులందరూ సుఖసంతోషాలుతో ఉండి, పంటలు సమృద్ధిగా పండేలా అమ్మవారిని వేడుకుంటూ బోనాలు సమర్పిస్తామన్నారు.

వృద్ధాశ్రమానికి పరుపుల వితరణ



వృద్ధులకు పరుపులను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకృష్ణ వృద్ధాశ్రమానికి 50 పరుపులను వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి రఫీ, సభ్యులు మద్దిలేటి, రంగప్ప, బాలసుబ్రమణ్యం, శివకుమార్, రహీం, షాకీర్, రామూర్తి, రమేష్‌బాబు, అలీ, సుబ్బరామయ్య, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పెద్దవడుగూరు: పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడి సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, ఎస్.ఎన్.మల్లీశ్వరి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు పత్తి పంట పూర్తయిన అనంతరం వ్యర్థాలను తొలగించి కాల్చకుండా ముక్కలుగా మిషన్‌తో కత్తిరించి పొలంలో చల్లి దుక్కులు చేయడం ద్వారా భూసాంద్రతను పెంచుకోవచ్చున్నారు. వ్యర్థాలను కాల్చకుండా పొలంలో కలిపి వేయడం వలన పంట దిగుబడికి తోడ్పడే శిలీంద్రాలు జీవిస్తాయన్నారు. అలాగే పశువుల పేడ వాడటం వలన కలిగే లాభాలు, రసాయన ఎరువులు వాడటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. షట్టర్ మిషన్ కావాల్సిన రైతులు వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ సునీత, ఆర్‌బీకే వీహెచ్‌ఏ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

యల్లనూరు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని తహసీల్దారు రాజా సూచించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి మూడు వినతులు వచ్చాయన్నారు. భూమి ఆన్‌లైన్ చేయాలని ముగ్గురు రైతులు వినతిపత్రాలు అందజేశారు. పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

పామిడి: పట్టణంలోని నెహ్రూనగర్‌లో అండా ఉగ్గాణి మాబూ కుటుంబాన్ని సోమవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు పరామర్శించారు, ఇటీవల అండా ఉగ్గాణి మాబు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపి, ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

వృద్ధుడి మృతి

పామిడి: అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మండలంలోని కండ్లపల్లికి చెందిన ఓబన్న (85) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఏఎస్‌ఐ షాషావలి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత శుక్రవారం అర్ధరాత్రి ఓబన్న బీడీ తాగేందుకు అగ్గిపుల్ల వెలిగించాడు. అప్పటికే వణుకుడు రోగంతో ఓబన్న బాధపడేవాడు. ఈ క్రమంలో చెయ్యి వణికి అగ్గిపుల్ల దుస్తులపై పడి నిప్పు అంటుకుంది. ఆయన కేకలు వేయడంతో ఇంట్లో మధ్య గదిలో నిద్రించిన కుమారుడు, వెలుపల నిద్రించిన భార్య ఆదెమ్మ వచ్చిచూసేసరికి ఓబన్నకు కాలిన గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అనంతపురం సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.